
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం KHAMMAM
ఆదివారం, 10 మార్చి 2024
5



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	36	25
భద్రాద్రి కొత్తగూడెం	37	25

మిద్దె తోట అదుర్స్..



ఖమ్మం రోటరీనగర్‌లో మిద్దెతోట వద్ద కైసారీ బేగం



- డాబాపై ఆకుకూరలు, కూరగాయల సాగు
- సేంద్రియ పద్ధతిలో పండిస్తూ సత్ఫలితాలు
- ఆదర్శంగా నిలుస్తున్న కవిరాజ్‌నగర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి
- స్ఫూర్తిదాయకమవుతున్న రోటరీనగర్ ఉపాధ్యాయిని

సండే స్పెషల్ SUNDAY SPECIAL

ఖమ్మం వ్యవసాయం, మార్చి 9: మార్కెట్‌లో నిగనిగలాడుతూ కనిపించే పండ్లు, కాయగూరల మాటున విషపదార్థాలు దాగుంటున్నాయి. డబ్బు పెట్టి మరీ అనారోగ్యాన్ని కొనుగోలు చేయాల్సి వస్తోంది. పంటల సాగులో విపరీతంగా ఉపయోగించే రసాయన పదార్థాల వల్ల ఆసుపత్రిపాలు కావాల్సిన అగత్యం ఏర్పడింది. ఈ క్రమంలో మన పంట మనం పండించుకుంటే ఎలా ఉంటుందనే ఆలోచనతో ముందడుగు వేశారు వేర్వేరు నేపథ్యాలున్న ఇద్దరు ఔత్సాహికులు.

మిద్దె తోటపై సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మక్కువ..

ఖమ్మం నగరంలోని కవిరాజ్‌నగర్‌కు చెందిన కె. శ్రీనివాస్ రెండు సంవత్సరాలుగా మిద్దెతోట సాగు చేస్తున్నారు. అమ్మ రామతులసిని ఆదర్శంగా తీసుకుని తన 200 గజాల స్థలంలో పూలు, పండ్లు, కూరగాయలు పండిస్తున్నారు. ఆయన ఇంటి కప్పుపై 70కిపైగా పండ్ల మొక్కలను, సీజన్‌కు సరిపోయేలా కూరగాయలు, ఆకు కూరల మొక్కలు ఉన్నాయి. ఇండోర్ ప్లాంట్లు అధిక ప్రాధాన్యం ఇస్తూ ఇంటి మిద్దెనే అందమైన చిట్టడివిలా మార్చారు శ్రీనివాస్. చీడపీడలు రాకుండా వేప నూనే, పుల్లటి మజ్జిగ, కలబంద, ఆవు మూత్రం, కిచెన్ వేస్ట్‌ను వాడుతున్నారు. ఎలాంటి రసాయన ఎరువులును ఉపయోగించరు.

ఇంటిపైనే సేంద్రియ సాగు..

చంద్రుగొండ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లీష్)గా పనిచేసే షేక్ కైసారీ బేగం నగరంలోని రోటరీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. షేక్ కైసారీ బేగం 2018లో సొంత ఇళ్లు కట్టిన తర్వాత మరుసరి ఏడాది నుంచే పూల మొక్కలు వేశారు. 8వ తరగతి చదువుకునే కూతరు జోయా తనకు స్ఫూర్తి అని ఉపాధ్యాయురాలు కైసారి బేగం చెబుతున్నారు. చిన్నతనంలోనే బాలిక మొక్కలను పెంచుతున్న తీరును చూసిన కైసారి బేగం తన ఇంటి పైభాగాన్ని సుందరమైన నందనవనంగా మార్చారు. మాకు సరిపోను వాడుకున్నాక మిగతా కూరగాయలను బంధుమిత్రులు, ఇరుగు పొరుగు వారికి పంచుతామని అని వివరించారు కైసారి బేగం. ఇటీవల హైదరాబాద్‌లో రైతు నేస్తం ఆధ్వర్యంలో తుమ్మేటి రఘోత్తమ రెడ్డి మిద్దెతోట పురస్కారం- 2023 అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఖమ్మం నగరంలో మిద్దెతోటతో అద్భుతాలు సృష్టిస్తున్న కె శ్రీనివాస్, షేక్ కైసారీ బేగం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆ అవార్డులు అందుకున్నారు.



ఖమ్మం కవిరాజ్‌నగర్‌లోని తన నివాస భవనంపై మిద్దెతోటలో శ్రీనివాస్



ఖమ్మం మున్నేరు వైపు ప్రవహిస్తున్న పాలేరు జలాలు

హమ్మయ్య.. గండం గడిచినట్టే!

- పాలేరు జలాశయం నుంచి ఖమ్మం నగరానికి 500క్యూసెక్కుల నీటి విడుదల
- 25రోజుల వరకు రోజు విడిచి రోజు సరఫరా

కూసుమంచి/ఖమ్మం కార్పొరేషన్, మార్చి 9: ఖమ్మం నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు మున్నేరుకు, లకారం చెరువుకు నీటిపారుదలశాఖ అధికారులు పాలేరు జలాశయం నుంచి సాగర్ జలాలు విడుదల చేశారు. మున్నేరులో నీరు అడుగంటిపోవడంతో ఖమ్మం నగరంలో తాగునీటి సమస్యలు తలెత్తుతున్న విషయం విధితమే. ఈ క్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు పాలేరు జలాశయం నుంచి ఒకరోజుపాటు 500క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. పాలేరులో శనివారం ఉదయం వరకు 10.8 అడుగుల మేర నీటిమట్టం ఉండగా, రాత్రి వరకు 9.8 అడుగుల వరకు చేరింది. నీటిమట్టం 9 అడుగులకు చేరితే నీటి విడుదల కష్టమవుతుంది. కాగా, ప్రస్తుతం విడుదల చేసిన 500క్యూసెక్కుల నీటితో ఖమ్మం నగరానికి 25 రోజులపాటు తాగునీటి ఇక్కట్లు తలెత్తవని భావిస్తున్నారు. నీటికొరత మూలంగా నగరానికి రోజు విడిచి రోజు తాగునీటిని సరఫరా చేయనున్నట్టు కేఎంసీ అధికారులు తెలిపారు.

పకడ్బందీ ఏర్పాట్లు



రేపే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రి పర్యటన

- ముస్తాబవుతున్న భద్రాచల రామయ్య క్షేత్రం
- స్థానిక మార్కెట్ యార్డులో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం
- మణుగూరులో బహిరంగ సభ
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు

భద్రాచలం/మణుగూరు టౌన్, మార్చి 9: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం తొలిసారి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో పర్యటించనున్నారు. సీఎం పర్యటనకోసం భద్రాద్రి జిల్లా అధికార యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటితోపాటు ఇతర మంత్రులు రెండు ప్రత్యేక హెలికాప్టర్లలో సోమవారం బూర్గంపాడు మండలం సారపాకలోని బీపీఎల్ హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం భద్రాద్రి రామయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇందుకోసం దేవస్థానం అధికారులు రామాలయం, ఆలయ పరిసరాలు అందంగా తీర్చి దిద్దారు.

రామాలయ అభివృద్ధిపై సీఎం రేవంత్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉండటంతో ఆలయాభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే దేవస్థానం వైదిక పరిపాలన అధికారులతో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పలు దఫాలు సమీక్షించారు. సీఎం సమక్షంలో దేవస్థానం అభివృద్ధిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ఈ క్రమంలో దేవాదాయశాఖ అదనపు కమిషనర్ కూరాకుల జ్యోతి ఆదివారం భద్రాచలం చేరుకొని ఏర్పాట్లను పరిశీలించనున్నారు.

ఇదిలా ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదోదైన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి భద్రాద్రి రామయ్య సన్నిధిలో సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ముందుగా ఈ కార్యక్రమాన్ని మిథిలా స్టేడియంలో నిర్వహించాలని అధికారులు భావించగా సాంకేతిక కారణాలతో వేదికను భద్రాచలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు మార్చారు. అక్కడ ఏర్పాట్లను శనివారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, భద్రాద్రి డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, భద్రాద్రి జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు తదితరులు పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం తరువాత భద్రాద్రి జిల్లా యంత్రాంగంతో సీఎం సమీక్ష ఉంటుందని అధికారవర్గాలు తెలిపాయి.



భద్రాచలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక

మణుగూరు సభకు ఏర్పాట్లు

పినపాక నియోజకవర్గంలోని మణుగూరులో సోమవారం నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సీఎంతో పాటు పలువురు మంత్రులు ఈ సభకు వచ్చే అవకాశం ఉండడంతో గతంలో ఇక్కడ ఉన్న హెలిప్యాడ్‌తోపాటు మరో హెలీప్యాడ్‌ను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారు. ఈ సభకు భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశముండడంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సభా ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం హెలీపాడ్ ఏర్పాటు, సభ ప్రాంగణాన్ని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్, ఆర్‌అండ్‌బీ శాఖ ఎస్ఈ శ్యాంప్రసాద్‌లతోపాటు కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. భద్రాద్రి డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పనుల పర్యవేక్షణలో మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ రాజేష్‌లతోపాటు సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారి వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో, ఇరిగేషన్, మునిసిపాలిటీ అధికారులు ఉన్నారు.



మణుగూరులో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య తదితరులు

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ప్రియాంక


భద్రాచలంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా అధికారులకు అప్పగించిన పనులను సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. భద్రాచలం మార్కెట్ యార్డులో సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం సాయంత్రం ఆమె ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, ఎస్పీ రోహిత్‌రాజ్‌లతో కలిసి పరిశీలించారు అనంతరం భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం సీఎం ముందుగా సీతారామచంద్రస్వామిని దర్శించుకుని, మార్కెట్‌యార్డులో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొంటారని, అనంతరం గృహనిర్మాణ పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. భోజన అనంతరం మణుగూరులో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో రవీంద్రనాథ్, డీఆర్‌డీవో విద్యాచందన, డీఎస్‌వో రుక్మిణి, భద్రాచలం ఆర్డీవో కే. దామోదర్‌రావు, భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



- ఆధ్యాత్మికం, ఆనందం, ఆహ్లాదంతోనే పర్యాటకానికి ఊతం
- భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి
- భక్తరామదాసు ప్రాజెక్టుపై దృష్టి పెట్టాలి
- పర్ణశాలను తీర్చిదిద్దాలి

భద్రాద్రికి కొత్త సొబగులు అద్దాలి..





- ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలెన్నో..
- కొత్త బొగ్గు బావులు లేక జాడలేని నియామకాలు
- సాకారం కాని కార్మికుల సొంతింటి కల
- సీఎం పర్యటనపై ఆశలు

సీఎం కరుణ కోసం 'సింగరేణి' నిరీక్షణ



గిరిజనుల చెంతకు మంత్రి మనవడు...

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మనవడు ప్రయాస్ శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని అటవీ గ్రామాల్లో సందడి చేశాడు. కాంగ్రెస్ నాయకులతో కలిసి పూచికకుంట, కట్కూరు గ్రామాలకు వెళ్లి గిరిజనుల ఆచార వ్యవహారాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నాడు. తమకు ప్రధానంగా రోడ్లు, ఇళ్లు, వైద్యసేవలు అందేలా చూడాలని గిరిజనులు కోరగా, 'మా తాతయ్య దృష్టికి తీసుకెళ్తా' అని ప్రయాస్ బదులిచ్చాడు. ఈ సందర్భంగా గిరిజనుల విల్లంబును సరదాగా చేబూని ఎలా సంధిస్తారో తెలుసుకున్నాడు. ప్రయాస్ హైదరాబాద్‌లోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇటీవలే సెవెంత్ క్లాస్ పూర్తి చేశాడు. -దమ్మపేట



నేడు ఎన్వీ రమణకు సన్మానం

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 9: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణకు ఆదివారం ఖమ్మం విచ్చేయనున్నారు. ఖమ్మంలోని స్వర్ణ భారతి కల్యాణ మండపంలో ఆయన అభిమానులు నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనంలో జస్టిస్ రమణ దంపతులు పాల్గొంటారు. ఈ సందర్భంగా జస్టిస్ రమణను ఘనంగా సన్మానించనున్నారు. ఈ ఆత్మీయ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తదితరులు హాజరవుతారని కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు తెలిపారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు స్వర్ణభారతి కల్యాణమండపంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి అందరు హాజరుకావాలని కోరారు.



ఐఎంఎల్ డిపో ఇన్‌ఛార్జ్‌కి వినతిపత్రం అందజేస్తున్న మద్యం వ్యాపారులు

ఈ భారం మోయలేం...

- వ్యాట్ అమలుపై మద్యం వ్యాపారుల నిరసన
- వైరాలో ఐఎంఎల్ డిపో ముందు ఆందోళన
- ఉమ్మడి జిల్లాలో షాపులకు నిలిచిపోయిన మద్యం సరఫరా

యాప్‌తో ఏమార్చి..

అశ్వారావుపేట రూరల్, మార్చి 9: అధిక ధరను ఆశచూపి కాటాల్లో మోసం చేస్తూ కొందరు వ్యాపారులు మిర్చి రైతులను నిండా ముంచుతున్నారు. అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి గ్రామంలో శనివారం కొందరు వ్యాపారులు సెల్‌ఫోన్‌లోని యాప్ ద్వారా కాంటాను కంట్రోల్ చేస్తూ మోసగిస్తున్న విషయాన్ని పసిగట్టిన రైతులు సదరు వ్యాపారులకు దేహశుద్ధి చేశారు. ఈ వ్యవహారంలో గ్రామపెద్దలు పంచాయతీ నిర్వహించి రూ.2లక్షలకు ఒప్పందం చేయగా దానికి కొందరు రైతులు అంగీకరించకపోవడంతో ఈ వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది.

ఖమ్మం జిల్లాలోని తల్లాడ ప్రాంతానికి చెందిన ఏడుగురు వ్యక్తులు రెండు వ్యాన్లలో గుమ్మడివల్లి ప్రాంతానికి మిర్చిని కొనుగోలుకు వచ్చారు. కొంతకాలంగా వీరు ఈ ప్రాంతంలో అనేక గ్రామాల్లో మిర్చిని కొనుగోలు చేస్తున్నారు. తాలు మిర్చిని మార్కెట్ ధర కంటే రూ.2వేల వరకు అధనంగా చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

సాధారణంగా మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే చిల్లర వ్యాపారస్తులు కొనుగోలు చేస్తారు. కానీ ఇక్కడ మాత్రం చిల్లర వ్యాపారులు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో సదరు వ్యాపారులు శనివారం రైతుల వద్ద మిర్చిని కొనుగోలు చేసి కాటా వేస్తుండగా కాటాపై పెట్టిన మిర్చి బరువులో తేడా ఉండటంతో రైతులకు అనుమానం వచ్చి తమ వద్ద ఉన్న కాటాల ద్వారా తూకం వేయగా వ్యాపారుల కాటాలో మోసం ఉన్నట్లు గుర్తించారు.

చిల్లర వ్యాపారులు తమ ఎలక్ట్రికల్ కాటాలను ఫోన్‌లో యాప్ ద్వారా కంట్రోల్ చేస్తూ మోసం చేస్తున్నట్లుగా గుర్తించారు. దీంతో ఆగ్రహానికి గురైన రైతులు కొనుగోలుదారులను నిలదీశారు. ఈ క్రమంలో అక్కడ నుంచి ముగ్గురు వ్యాపారులు పారిపోగా మరో నలుగురిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం గ్రామపెద్దలు పంచాయతీ నిర్వహించి నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరగా సుమారు రూ.రెండు లక్షలు ఇచ్చినట్లుగా సమాచారం. అయితే ఈ నగదును గ్రామ అవసరాల కోసం వినియోగిస్తారని పెద్దమనుషులు తెలపటంతో కొందరు రైతులు వ్యతిరేకించారు.

తాము నష్టపోతే నగదు తమకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వ్యాపారులను, రెండు వాహనాలను స్టేషన్‌కు తరలించారు. సంఘటనకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు. ఇదే విషయమై అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీను మాట్లాడుతూ ఈ ఘటనపై ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు ఇవ్వలేదని, మోసపోయిన రైతులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి చర్యలు చేపడతామని తెలిపారు.



పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చిన వాహనాలు

- మిర్చి తూకాల్లో వ్యాపారుల దగా
- ఫోన్‌యాప్ ద్వారా ఎలక్ట్రికల్ కాటా కంట్రోల్
- నలుగురిని చితకబాదిన రైతులు
- భద్రాద్రి జిల్లా గుమ్మడివల్లిలో ఘటన

2115మంది ఆర్టీసీ ఉద్యోగులకు లబ్ధి

21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన ప్రభుత్వం

ఖమ్మం ఖానాపురం హవేలి మార్చి 9: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు 21శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించింది. ఈ కొత్త ఫిట్‌మెంట్ జూన్ 1నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని ఏడు డిపోల పరిధిలో 2115మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. ఖమ్మం డిపో పరిధిలో మొత్తం 489మంది ఉద్యోగులు, మధిరలో 243, సత్తుపల్లిలో 328, భద్రాచలంలో 394, కొత్తగూడెంలో 233, మణుగూరులో 272, ఇల్లెందులో 106, మొత్తం 2115మంది ఆర్టీసీ ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరందిరికీ ఈ ఫిట్‌మెంట్‌తో జీతాలు పెరగనున్నాయి. ఖమ్మం రీజియన్ పరిధిలోని కిందిస్థాయి ఉద్యోగి నుంచి రీజనల్ మేనేజర్ వరకు 2115 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో డ్రైవర్, కండక్టర్లే అధికం. ఈ ఫిట్‌మెంట్‌తో నెలకు రూ.2 కోట్ల వరకు సంస్థకు ఆర్థిక భారం పడనుంది. ప్రస్తుతం మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఖమ్మం రీజియన్ పరిధిలో ప్రయాణికులకు సరిపడ బస్సులు అందుబాటులో లేకపోవటంతో కొన్ని రూట్లకు బస్సులను నడిపే పరిస్థితి లేకుండాపోయింది. ఖమ్మం రీజియన్‌కు 100బస్సులు అవసరం ఉన్నట్లు సంస్థ అధికారులు చెబుతున్నారు. డ్రైవర్, కండక్టర్ల, బస్సుల కొరతతో ఆర్టీసీకి కొంత ఆదాయం తగ్గుతుందనే చెప్పవచ్చు. ప్రస్తుతం రీజియన్ పరిధిలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల అవసరం ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది.

సీఎం కరుణ కోసం 'సింగరేణి' నిరీక్షణ



ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు ఎన్నో..

- నూతన బొగ్గు బావులు లేక జాడలేని నియామకాలు
- సాకారం కాని కార్మికుల సొంతింటి కల
- ఐటీ రద్దు కోసం ఎదురుచూపులు
- ఆధునీకరణకు నోచుకోని ఆస్పత్రులు
- అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు వర్కర్ల పర్మినెంట్ ఎప్పుడో
- రేపటి సీఎం పర్యటనపైనే ఆశలు

కొత్తగూడెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూర్తి ఏజెన్సీ జిల్లా అయినప్పటికీ పారిశ్రామిక పరంగా ఎంతో అభివృద్ధి సాధిస్తోంది. జిల్లాలో సింగరేణి సంస్థ, కేటీపీఎస్ విద్యుత్ కర్మాగారం, నవభారత్, అశ్వాపురంలో భారజల కర్మాగారం, భద్రాచలంలో బీపీఎల్ కర్మాగారం, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లో ఓపెన్‌కాస్టు, అండర్‌గ్రౌండ్ బొగ్గుబావులు ఉండగా, వ్యవసాయపరంగా గోదావరి నదీ పరివాహక ప్రాంతంతో పాటు సీతారామ ప్రాజెక్టు, గోదావరి నదీజలాలు, సీతమ్మసాగర్ ప్రాజెక్టు తదితర వనరులెన్నో ఉన్నాయి. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద పరిశ్రమ అయిన సింగరేణి బొగ్గు గని సంస్థ కూడా ఈ జిల్లాలోనే పుట్టింది. సింగరేణి పరంగా ఎన్నో సమస్యలు అనేక ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్నాయి.

రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రేవంత్‌రెడ్డి తొలిసారిగా ఈ నెల 11వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వస్తున్నారు. భద్రాద్రి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారానికి సీఎం చొరవ తీసుకోవాలని భిన్న వర్గాల ప్రజల కోరుతున్నారు.

సింగరేణి సంస్థ వేలాదిమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. సంస్థలో కొత్త బొగ్గుబావుల నిర్మాణాలకు ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదనలు చేపట్టారు. వాటిలో కొన్ని బొగ్గు బావులకు అనుమతులకు నోచుకోక మరికొన్ని అనుమతులు వచ్చినప్పటికి బావులు తవ్వకాలు చేపట్టకపోవడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అనుకున్న స్థాయిలో సాధించలేకపోయారు. కొత్తగా ప్రతిపాదించిన 9 బొగ్గుబావులు నిర్మాణాలకు నోచుకోలేకపోతున్నాయి. ఇప్పటికైన ఈ ప్రాజెక్టుల నిర్మాణాలు త్వరితగతిన ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సొంతింటి కల సాకారం ఎప్పుడో..

సింగరేణి సంస్థలో సుమారు 40వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరందరికీ సొంతింటి కల ఇప్పటికీ సాకారం కాలేదు. గతంలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఎఐటీయూసీ, తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం, ఐఎన్‌టీయూసీ కార్మికసంఘాలతోపాటుగా గతంలో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ సైతం సింగరేణి కార్మికులకు తప్పని సరిగా సొంత ఇంటిని నిర్మాణం చేపడతామని ఎన్నో సార్లు నేతలు హామీల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీ కూడా అధికారం చేపట్టిన తర్వాత సింగరేణి కార్మికుల సొంతింటి కల నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు సింగరేణి కార్మికుల సొంతింటి నిర్మాణం జరగలేదు.

ఇన్‌కంట్యాక్స్ రద్దు ఎప్పుడో...

సింగరేణి సంస్థలో పని చేస్తున్న కార్మికులకు ఇన్‌కంట్యాక్స్ రద్దు ప్రతి సారి నేతల హామీ గానే మిగిలిపోతోంది. గత ఎన్నికల్లో బీజేపీ, బీఎంఎస్, ఇతర జాతీయ కార్మికసంఘాలు లాంటి కార్మికసంఘ, అధికార పార్టీ సైతం సింగరేణి కార్మికుల ఇన్‌కం ట్యాక్స్ మినహాయింపు విషయంలో కేంద్రంతో మాట్లాడతామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఏమి చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికుల ఇన్‌కాంట్యాక్స్‌ను మినహాయించాలని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నారు.

ఆసుపత్రుల ఆధునీకీకరణ

సింగరేణి వ్యాప్తంగా ప్రధాన ఆసుపత్రితోపాటుగా వివిధ ఏరియాల్లో జిల్లాలో ఉన్న ఆసుపత్రుల్లో అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పరికరాలతో ఆధునీకరణచేపట్టాల్సి ఉంది. సింగరేణి అధికారులకు, కార్మికులకు మెరుగైన సూపర్‌స్పెషాలిటీ వైద్య చికిత్సలు అందాలంటే చివరి హైదరాబాద్‌లోని ప్రైవేట్ సూపర్‌స్పెషాలిటి ఆసుపత్రులకు తరలించాల్సిందే.

కొత్తగూడెంలో విమానాశ్రయం

కొత్తగూడెంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో విమానాశ్రయం మంజూరైంది. కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాన్ని కూడా పరిశీలించి కేంద్రం నుంచి విమానాశ్రయానికి సంబంధించిన బృందం వచ్చి పరిశీలించి వెళ్లారు. అయినప్పటికి పదేళ్ల గడుస్తున్న ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉంది.

ఐఎఎస్‌లనియామకం

సింగరేణి సంస్థకు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పోస్టులో తప్పని సరిగా ఒక సీనియర్ ఐఎఎస్‌కు సంబంధించిన అధికారే ఉండి బాధ్యతలు నెరవేర్చాల్సి ఉంది. దీంతోపాటు సంస్థ పరిపాలన తదితర విషయాలకు సంబంధించిన డైరెక్టర్ (పా) పోస్టు కూడా ఐఎఎస్ హోదాగల సీనియర్ అధికారితో పోస్టు భర్తీ చేయాల్సి ఉంది. కొన్ని ఏళ్ల నుంచి సంస్థలో డైరెక్టర్ (పా) పోస్టుకు ఐఎఎస్ అధికారి కొరత ఏర్పడింది. దీంతో డైరెక్టర్ల నుంచే ఒకర్ని నియమిస్తున్నారు. ప్రస్తుతం సీఎండీ పోస్టు కూడా ఐఆర్ఎస్‌కు సంబంధించిన డైరెక్టర్ అధికారితోనే కొనసాగిస్తున్నారు.

కొత్త నియామకాలు

సింగరేణి సంస్థలో పూర్తిస్థాయిలో కొత్తఉద్యోగాల నియామకాలు చేపట్టలేదు. కొత్తగా బొగ్గుబావులు సృష్టించి సింగరేణి పరిధిలో ఉన్న జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉంది. అలాగే సంస్థలో సుమారు 25వేల నుంచి 30వేలలోపు వివిధ విభాగాల్లో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు వర్కర్స్‌గా రోజువారి వేతనంతో పని చేస్తున్నారు. వీరిని పర్మినెంట్‌చేయాలని ఎన్నో సార్లు ఆందోళనలు సైతం జరిగాయి. ఇప్పటికీ రెగ్యూలర్ చేయలేకపోయారు.

మైనింగ్, గిరిజన యూనివర్శిటీలు

జిల్లాలో మైనింగ్ యూనివర్శిటి, గిరిజన యూనివర్శిటీలు నెలకొల్పుతామని గతంలో హామీ ఇచ్చినప్పటికి ఇప్పటి వరకు నెరవేర్చలేదు. భద్రాద్రి దేవస్థానం అభివృద్ధికి, పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాల్సి ఉంది. ఏజెన్సీ ప్రాంతమైన ఈ జిల్లాలో గిరిజనేతరులకు కూడా ఇళ్ల స్థలాలు వారి వ్యవసాయ భూములకు పట్టాలు, కొనుగోలు అమ్మకాలు సైతం ఏర్పాటు చేస్తే మరింత జిల్లా అభివృద్ధి జరిగే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో ఉన్నటువంటి అటవీ పోడువ్యవసాయ భూములన్నింటికీ కూడా పట్టాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ప్రైవేటు బస్సు బోల్తా.. ముగ్గురికి తీవ్రగాయాలు


క్షతగాత్రులను 108వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం


బోల్తాపడిన ట్రావెల్స్ బస్సు

కూసుమంచి, మార్చి 9: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లోక్యాతండ సమీపంలో ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ప్రైవేటు బస్సు బోల్తాపడింది. ఈప్రమాదంలో ఏపీలోని కాకినాడ, సామర్లకోట ప్రాంతాలకు చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, మరో 10మందికి స్వల్ప గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కాకినాడ బయలుదేరింది. ఈక్రమంలో ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లోక్యాతండ ప్రాంతానికి చేరుకోగానే డ్రైవర్ నిద్రమత్తుతో బస్సు అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టారు. దీంతో బస్సు ఒక్కసారిగా సర్వీస్‌రోడ్డులోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. బస్సులో 31మంది ప్రయాణిస్తుండగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మరో 10మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ప్రయాణికులు వేరేవాహనాల్లో స్వస్థలాలకు వెళ్లిపోయారు.

టీపీజేఎంఏ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోటేశ్వరరావు




కోటేశ్వరరావు, వీరారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి

సత్తుపల్లి/లక్ష్మీదేవిపల్లి, మార్చి9: తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్య సంఘం (టీపీజేఎంఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొత్తగూడెం కృష్ణవేణి-త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ మాచవరపు కోటేశ్వరరావును ఎన్నుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వీరారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కోటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీవాణి బాలికల జూనియర్ కళాశాల నిర్వహకుడు పాలా ప్రవీణ్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న జూనియర్ కళాశాలల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పలువురు వారిని అభినందించారు.

అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ కోచ్‌గా సునందకోరి ఎంపిక


సునందకోరి

ఇల్లెందుటౌన్, మార్చి 9: అథ్లెటిక్స్ ఇంటర్‌నేషనల్ కోచ్‌గా ఇల్లందులోని 14వ నంబర్ బస్తీకి చెందిన సునందకోరి ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం వరల్డ్ అథ్లెటిక్స్ కోచ్ ప్రెసిడెంట్ సబస్టీయన్‌కో నియమక ఉత్తర్వులను జారీ చేశారు. సునందకోరి అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరచడంతో కోచ్‌గా ఎంపిక చేశారు. జనవరి 3 నుంచి 8 వరకు పాటియాలలో జరిగిన కోచ్ ఎడ్యూకేషన్ శిబిరంలో పాల్గొని ప్రతిభ కనబరిచి ఇంటర్‌నేషనల్‌గా కోచ్‌గా ఎంపికయ్యారు. సునందకోరి ఎంపిక పట్ల ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ సుదర్శన్ కోరిలు హర్షం వ్యక్తం చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి

● మరొకరికి గాయాలు..

ఖమ్మంక్రైం, మార్చి9: రోడ్డు ప్రమాదంలో ఇస్రో రిటైర్డు ఉద్యోగి మృతి చెందిన సంఘటన శనివారం ఖమ్మం నగరంలో జరిగింది. బంధువుల కథనం ప్రకారం నగరంలోని శ్రీరామ్‌హిల్స్‌లో నివసించే బట్టు జయాసింగ్ (65) ఇస్రో ఉద్యోగిగా పనిచేసి పదవీ విరమణ చేశాడు. శనివారం పని నిమిత్తం ద్విచక్రవాహనంపై బయటకు వచ్చిన ఆయన ప్రమాదశాత్తు కింద పడ్డాడు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్తుపల్లిరూరల్: ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొనగా వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన సత్తుపల్లి పట్టణ శివారులోని జేవీఆర్ పార్క్ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. సత్తుపల్లిలోని ఓ బేకరీలో పనిచేసే దమ్మపేట మండలం ముద్దులగూడేనికి చెందిన వంశీకుమార్ పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా, జేవీఆర్ పార్క్ సమీపంలోని వినాయక హోటల్ వద్ద ఓ వాహనం ఢీకొట్టింది. కాగా తీవ్రంగా గాయపడిన వంశీని మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

కోడిపందేల స్థావరాలపై పోలీసుల దాడులు

దమ్మపేట, మార్చి 9: మండలంలోని రెండు గ్రామాల సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరాలపై శనివారం పోలీసులు దాడులు జరిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాలపల్లి, రాచూర్‌పల్లి ప్రాంతాల్లో కొందరు కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తన సిబ్బందితో దాడులు జరిపారు. దాడుల్లో 8 ద్విచక్రవాహనాలను, మూడు కోడిపుంజులను, 20,500 నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు 11 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అక్రమ ఇసుక రవాణా కేసులో ఇరువురి అరెస్టు

ఖమ్మం క్రైం, మార్చి 9: అక్రమ ఇసుక రవాణా కేసులో ఖమ్మం జిల్లా లారీ అసోసియేషన్ మాజీ కార్యదర్శి బోయపాటి వాసు ను ఖమ్మం టూటౌన్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఖమ్మానికి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ఓ లారీని శనివారం ఉదయం బైపాస్ రోడ్‌లో టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఆ లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఈ ఇసుకను వాసుతో పాటు, వెంకటేశ్వరరావు అనే వ్యక్తి కలిసి రవాణా చేస్తున్నట్లు విచారణలో వెల్లడయిందని తెలిపారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి అతడిని కూడా అరెస్టు చేశారు. కాగా గతంలో కూడా అక్రమ ఇసుక రవాణాపై అతడిపై పలు ఆరోపణలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు.

కిష్టారంలో కొనసాగుతున్న వైద్య శిబిరం


గ్రామస్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సత్తుపల్లిరూరల్, మార్చి9: 'జ్వరంతో మంచంపట్టిన కిష్టారం' ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి స్పందిస్తూ రెండో రోజు శనివారం మండలంలోని కిష్టారంలో వైద్య శిబిరం కొనసాగింది. గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సింగరేణి ఆధ్వర్యంలో గ్రామంలోని అంబేద్కర్ నగర్, ఎస్సీ కాలనీలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి రోగులను పరీక్షించి మందులను అందజేశారు. రెండు రోజులకు గా నూ సింగరేణి మెడికల్ క్యాంప్ ద్వారా 327మందిని పరీక్షిం చినట్లు కిష్టారం ఓసీ పీవో నరసింహారావు తెలిపారు.

ఎంపీ నామా ఫ్లెక్సీల చించివేత

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నాయకులు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వైరా, మార్చి 9: వైరా మునిసిపాలిటీ పదో వార్డులోని గండగలపాడులో మహాశివరాత్రి సందర్భంగా ఎంపీ నామా నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. స్నానాల లక్ష్మీపురంలోని పుణ్యక్షేత్రమైన రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గమధ్యలోని గండగలపాడులో ఎంపీ నామా నాగేశ్వరరావు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలు మొత్తాన్ని చించివేయగా ఇనుప ఫ్రేమ్‌లు మాత్రమే మిగిలాయి. శనివారం బీఆర్ఎస్ నాయకులు చించివేసిన ఫ్లెక్సీలను పరిశీలించి, ఫ్లెక్సీలను చించివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జునరావు, నాయకులు తన్నీరు నాగేశ్వరరావు, మాదినేని ప్రసాద్, నందిగామ మనోహర్, శ్రీను, గోపి, నరేష్ ఉన్నారు.

సింగరేణిలో గెలుపొందిన

సంఘానికి గుర్తింపు కరువు

● ఎన్నికలు జరిగి రెండు నెలలు దాటినా జారీ కాని ధ్రువీకరణ పత్రం

ఇల్లెందు, మార్చి 9: సింగరేణి కాలరీస్‌లో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించి రెండు నెలలు దాటుతున్నా గెలుపొందిన సంఘానికి అధికారికంగా గుర్తింపు ధ్రువీకరణ పత్రం జారీ చేయకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. 2023 డిసెంబరు 27న ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, అదిలాబాద్, జిల్లా పరిధిలోని కోల్ బెల్ట్ ప్రాంతంలో కార్మిక సంఘాల ఎన్నికలు జరిగిన విషయం విదితమే. అయితే ఆ ఎన్నికల్లో సింగరేణి కాలరీస్ వ్యాపిత గుర్తింపు సంఘంగా విజయం సాధించేందకుకు కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ, సీపీఐ అనుబంధ ఏఐటీయూసీతో పాటు మరో అయితే ఆ ఎన్నికల్లో 11కార్మిక సంఘాలు తలపడినప్పటికీ సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ ఘన విజయం సాధించింది. అయితే 6జిల్లాల పరిధి లో విస్తరించబడిన సింగరేణి కాలరీస్11డివిజన్‌లల్లో ఎన్నికలు జరగగా, ఏఐటీయూసీ 5డివిజన్ లల్లో, ఐఎన్‌టీయూసీ 6డివిజన్‌లల్లో ప్రాతినిధ్య సంఘంగా గెలుపొందగా, మొత్తం సింగరేణి వ్యాప్త గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ మెజార్టీతో విజయం సాధించింది. ఎన్నికలు జరిగి దాదాపు రెండున్నర నెలలు కావస్తున్నా కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ గాని, సింగరేణి కాలరీస్ యాజమాన్యం గాని నేటి వరకు గెలుపొందిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీకి అధికారికంగా ధ్రువీకరణపత్రం జారీచేయకపోవడం చర్చనీయాంశమైంది. గతంలో ఎన్నికల ఫలితాల వెంటనే వారం రోజుల్లోనే అధికారులు ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. గెలుపొందిన నాయకులకు యాజమాన్యం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలకు ప్రొటోకాల్ అమలు చేస్తున్నప్పటికీ అధికారిక గుర్తింపు పత్రం జారీ చేయకపోవడం గమనార్హం. ఫలితంగా సింగరేణి యాజమాన్యంతో కార్మిక సంఘాల అధికారిక సమావేశాలు జరగకపోవడం కార్మిక సమస్యలు అనేక నెలలుగా పెండింగ్‌లోనే ఉంటున్నాయి. కార్మిక శాఖ కోడ్‌ఆఫ్ డిసిప్లెన్ ప్రకారం సింగరేణి వ్యాప్త గుర్తింపు కార్మిక సంఘంతో స్ట్రక్చరల్ సమావేశాలు గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలతో జాయింట్ కాన్సల్‌టెట్యూవ్ కమిటి(జేసీసీ)సమావేశాలు సింగరేణి యాజమాన్యం నిర్వహించాల్సి ఉంది. వీటిలో కార్మికశాఖ సమస్యలు చర్చించాల్సి ఉంది.

గుర్తింపు కాల పరిమితి కారణమే జాప్యం

సింగరేణిలో గుర్తింపు ప్రాతినిధ్య కార్మిక సంఘాలుగా గెలుపొందిన యూనియన్లకు అధికారిక ధ్రువీకరణ పత్రాల జారీలో జరుగుతున్న జ్యాపానికి యూనియన్ కాలపరిమితి అంశ మే కారణమన్న ప్రచారం జరుగుతోంది. గతంలో గెలుపొందిన గుర్తింపు సంఘాల కాలపరిమితి రెండేళ్లు, నాలుగేళ్లుగా కొనసాగింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న తరుణంలో గెలుపొందిన తమ అనుబంధ కార్మిక సంఘానికి ఏకంగా ఐదేండ్లు సింగరేణి గుర్తింపు సంఘంగా అధికారం సాగించింది. అయితే తాజాగా జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం ఉన్న అనుబంధ ఐఎన్‌టీయూసీ ఓటమి చెందినప్పటికి దాని మిత్ర పక్షమైన సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ విజయం సాధించినప్పటికీ ప్రభుత్వం అధికారికంగా గుర్తింపు పత్రం జారీకి ఆదేశాలు ఇవ్వలేదని సమాచారం. సింగరేణిలో ఎన్నికల పక్రియ ప్రారంభించే దశలో కార్మిక సంఘాలతో కార్మిక శాఖ, సింగరేణి యాజమాన్యం కోడ్‌అఫ్ డిసిప్లెన్‌పై చర్చించాయి. ఈసమావేశంలో కొన్ని సంఘాలు రెండేళ్లు, మరి కొన్ని సంఘాలు నాలుగేళ్ల గుర్తింపు సంఘంగా కాలపరిమితి ఉండాలని కోరాయి. అయితే కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ అధికారులు ఈసమావేశాల్లో రెండేళ్ల కాలపరిమితితో కూడిన కోడ్ అఫ్ డిసిప్లెన్ నిబంధనల ప్రకారం ఆదేశాలు జారీ చేసి ఎన్నికలు జరిపాయి. కాగా గెలుపొందిన గుర్తింపు సంఘం కాలపరిమితి రెండేళ్లు ఉంటుందని కార్మిక శాఖ స్పష్టంగా ప్రకటించలేదు. ఫలితంగా గతంలో మాదిరిగా గుర్తింపు సంఘం కాల పరిమితి నాలుగేళ్లు ఉండాలని ఏఐటీయూసీ పట్టుబడుతున్నట్లు తెలిసింది.

కాగా ఇతర కార్మిక సంఘాలు మాత్రం కార్మిక సంఘాలు మాత్రం రెండేళ్ల కాలపరిమితితో కూడిన కోడ్‌అఫ్ డిసిప్లెన్ ప్రకారమే ఎన్నికలు జరిగాయని స్పష్టం చేస్తున్నాయి. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక మంత్రిత్వ శాఖ(సెంట్రల్)అధికారులతో చర్చించి కాలపరిమితో కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరదించేదాక గుర్తింపు ధ్రువీకరణపత్రం జారీ చేసే అవకాశం లేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

నష్టపరిహారం చెల్లించాలని రైతుల ఆందోళన


ఏన్కూర్‌లో ఆందోళన చేస్తున్న అన్నదాతలు

ఏన్కూరు, మార్చి9: నాటిన 70రోజులకే వరి ఎదుగు బొదుగు లేకుండా పొట్ట దశకు వచ్చి ఈనిందని అన్నదాతలు ఏన్కూరులోని ఓ విత్తన దుకాణం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. ఏన్కూరు మండలం గార్లొడ్డ గ్రామానికి చెం దిన సుమారు 20మంది రైతులు 60 ఎకరాల్లో ఏన్కూరుకు చెందిన ఓ విత్తన దుకాణం నుంచి ఓ రకం వరి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేశారు. కేవలం చల్లిన 70 రోజులకే వరి కంకులు వచ్చాయని, అవికూడా నాసిరకంగా ఉన్నాయని రైతులు ఆందోళన చెంది దుకాణ యజమానిని సంప్రదించగా సరైన సమాధానం చెప్పకపోవడతో ఆందోళనకు దిగారు. ఇలా ముందస్తుగా ఎందుకు కంకులు వస్తున్నాయని దుకాణ యజమానిని నిలదీశారు. తమకు కంపెనీ నుంచి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తాము ఇప్పటి వరకు ఎకరానికి రూ.25వేలు పెట్టుబడి పెట్టి నష్టపోయామ ని వా పోయారు. అనంతరం పోలీసులకు, వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈవిషయమై ఎస్ఐ బాదావత్ రవి, ఏవో నరసింహారావు రైతులతో మాట్లాడారు. కంపెనీ ప్రతినిధులను పిలిపించి మాట్లాడతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈకార్యక్రమంలో గోరంట్ల నరసింహారావు, పే లపోలు నరేష్, సయ్యద్ సుబాని, పఠాన్ మజీద్‌ఖాన్, కొటారి రమేష్, గరిడేపల్లి నరసింహారావు, గోపాలరావు, షికారి శ్రీను, శివలంకి అప్పారావు, శెట్టి ప్రవీణ్, రుక్మిణి పాల్గొన్నారు.

అతివేగంగా టిఫిన్ బండిని ఢీ కొట్టిన కారు

ఖమ్మం క్రైం, మార్చి 9: అతివేగంగా వచ్చి రోడ్డు పక్కన ఆపి ఉన్న ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టుకుంటూ వెళ్లి ఓ టిఫిన్ సెంటర్ తోపుడు బండిని ఓ కారు ఢీకొట్టిన సంఘటన శనివారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. నగరంలోని గొల్లగూడెం వైపు నుంచి వస్తున్న ఏపీ20ఏక్యూ9041 నెంబర్ గల కారును ఓ వ్యక్తి మధురానగర్ రోడ్ నెంబర్ 10 వద్ద అతివేగంగా నడుపుకుంటూ వచ్చాడు. అక్కడే రోడ్డు పక్కన ఉన్న మూడు ద్విచక్ర వాహనాలను అతివేగంగా ఢీ కొట్టుకుంటూ పక్కనే ఉన్న టిఫిన్ సెంటర్ తోపుడుబండిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో టిఫిన్ సెంటర్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కారు డ్రైవర్‌ని నిలదీయగా తనకు ఆరోగ్యం సరిగా లేదంటూ చెప్పాడు. అదే సమయంలో సమీపంలోని కొందరు రాజకీయ నాయకులు వచ్చి మాట్లాడుతుండగా సదరు కారు డ్రైవర్ స్థానికులతో గొడవపడి వారిపై దాడిచేసేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ భానుప్రకాష్ సంఘటన స్థలం వద్దకు చేరుకొని కారు డ్రైవర్ వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. అతడిని వెంటనే నగరంలోని ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన డ్రైవర్ రాజకీయంగా పలుకుబడి ఉన్న యువకుడిగా తెలిసింది.

మేడారం ప్రసాదం పంపిణీ


ప్రసాదాన్ని అందజేస్తున్న డిపో మేనేజర్ రాజలక్ష్మి

కల్లూరు, మార్చి 9 ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా మేడారం ప్రసాదాన్ని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి శనివారం కల్లూరులో పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ ఎండి సజ్జనార్ ఆదేశానుసారం మేడారం జాతరకు వెళ్లలేని వారి సౌకర్యార్థం భక్తుల ఇంటి వద్దకే మేడారం ప్రసాదాన్ని అందజేయలనే సంకల్పంతో ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా కేవలం రూ.299తో బుకింగ్‌లు ప్రారంభించామని తెలిపారు. దీనికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. సత్తుపల్లి డిపో పరిధిలో బుకింగ్ చేసుకున్న భక్తులకు ప్రసాదాన్ని ఆర్టీసీ అధికారులు పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ మునీర్‌పాషా, విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు, తదితర భక్తులు పాల్గొన్నారు.

జొమాటోకే చార్జి చేస్తున్నారు..

గ్యాస్ డెలివరీకి అదనంగా ఎందుకు ఇవ్వరు..

● సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన గ్యాస్ ఏజెన్సీ మాటల ఆడియోలు

రఘునాథపాలెం, మార్చి 9: ప్రజలపై గ్యాస్ ఆర్థిక భారం తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సందర్భాన్ని అనుసరించి కొన్ని రోజులుగా ధరలను తగ్గిస్తున్నాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్యాస్ సిలెండర్‌కు రూ.100 తగ్గించింది. ఇక రాష్ట్ర ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ సిలెండర్‌ను పథకాన్ని ప్రవేశ పెట్టి గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు గ్యాస్ ఆర్థిక భారంపై ఊరట కలిగిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఖమ్మం నగరంలోని గ్యాస్ ఏజెన్సీలు మాత్రం సమీపంలోనే ఉన్న గ్రామాలకు గ్యాస్ సరఫరా చేసి గ్రామీణ ప్రజల నుంచి అదనపు డబ్బులను వసూళ్లు చేస్తున్నాయి.

ఖమ్మం నగరంలోని గ్యాస్ ఏజెన్సీల నుంచి మాత్రమే రఘునాథపాలెం మండలానికి గ్యాస్ సరఫరా జరుగుతాయి. ఖమ్మం బైపా స్ రోడ్డు నుంచి రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తి గ్రామం 5 కీమీ దూరం ఉంటుంది. శనివారం చింతగుర్తి గ్రామానికి గ్యాస్ ఏజెన్సీ ద్వారా సిలెండర్లు పంపిణీ జరిగింది. ఈ క్రమంలో గ్రామంలోని దళితవాడలో గ్యాస్ సిలెండర్లను అందజేసిన ఏజెన్సీ రూ.900లను వసూళ్లు చేశారు. నిబంధనల మేరకు రూ.840 మాత్రమే చార్జి చేయాల్సి ఉంటుంది. ఇదేమిటని గ్రామానికి చెందిన కొందరు గ్యాస్ ఏజెన్సీకి ఫోన్ చేసి అదనంగా డబ్బులు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. జొమాటోలో ఫుడ్ ఆర్డర్ పెడితే చార్జీలు వసూళ్లు చేస్తున్నారు. ఊళ్లోకి వచ్చి గ్యాస్ అందిస్తే అదనంగా డబ్బులు ఇవ్వరా అంటూ గ్యాస్ ఏజెన్సీలు తిరిగి ప్రశ్నించారు. ఈ రోజు కొత్తగా తీసుకోవడం లేదని ఎన్నో ఏళ్లుగా ఇలానే తీసుకుంటున్నామని వాదించారు. దీంతో వినియోగదారులు ఆడియోను సోషల్ మీడియాలో వైరల్‌గా మార్చారు. ఈ విషయంపై తహసీల్దార్ విల్సన్‌ను వివరణ కోరగా విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు.

లారీ డ్రైవర్లకు డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు


డ్రంకెన్ డ్రైవ్ టెస్టును పరిశీలిస్తున్న సీఈ బిచ్చన్న

మణుగూరుటౌన్, మార్చి9: మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు మణుగూరు ఏరియాలోని సింగరేణి గనుల నుంచి బొగ్గు రవాణా చేసే టిప్పర్ లారీ డ్రైవర్లకు శనివారం ప్రత్యేకంగా డ్రంకెన్ డ్రైవ్ టెస్టులను నిర్వహించారు. టిప్పర్ల డ్రైవర్లపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో చేపట్టిన టెస్టులను బీటీపీఎస్ సీఈ బిచ్చన్న ప్రత్యక్షంగా పరిశీలించారు. బీటీపీఎస్ అధికారులు ప్రమాదాల నివారణకు ఓ అడుగు ముందుకు వేసీ లారీ డ్రైవర్లు మద్యం మత్తులో ఉన్నారో లేదో నిర్ణయించేందుకు టెస్టులు నిర్ణయించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేగ నియంత్రణకు లారీ డ్రైవర్లపై ట్రిప్పుల భారాన్ని తగ్గిస్తే వేగం కూడా కంట్రోల్ ఆయి ప్రమాదాలు పూర్తిగా తగ్గే అవకాశముందని పలువురు పేర్కొంటున్నారు.

వృక్షావేదన..

- బొగ్గు దుమ్ముతో పచ్చదనం కోల్పోతున్న చెట్లు
- పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఆవేదన
- నివారణ చర్యలు చేపట్టని సింగరేణి యాజమాన్యం

సత్తుపల్లిరూరల్, మార్చి9: సత్తుపల్లి నియోజకవర్గం కేంద్రం నుంచి ఖమ్మం వెళ్లే రహదారిలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇదే క్రమంలో సత్తుపల్లి శివారులోని కిష్టారం ఓసీ నుంచి బొగ్గు టిప్పర్లు సైతం ఇదే రహదారిలో ప్రయాణించాల్సి ఉంది. దీంతో రహదారి అంతా బొగ్గుమయంగా మారుతున్నాయి. సత్తుపల్లి నుంచి కిష్టారం వెళ్లే మార్గంలో బొగ్గు లారీల రాకపోకల కారణంగా బొగ్గు మసి, వాహనాల నుంచి వెలువడే పొగ కారణంగా రోడ్డుకు ఇరువైపుల ఉన్న భారీ వృక్షాలు సైతం నల్లగా బొగ్గు రంగులో మారుతున్నాయని, దీంతో వాతావరణంలో కాలుష్యం ఏర్పడుతుందని ప్రజలు చెబుతున్నారు. చెట్ల నుంచి ఆక్సిజన్ వెలువడే క్రమంలో ఈ బొగ్గు మసి కారణంగా పీల్చుకోవడంతో శ్వాసకోస వ్యాధులు ప్రభలుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. కనీసం కిష్టారం ఓసీ నుంచి వచ్చే బొగ్గు టిప్పర్లపై పరదాలు కప్పడం లేదని, రహదారిపై వాటరింగ్ చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కిష్టారం గ్రామంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వచ్చినప్పుడు మాత్రమే నివారణ చర్యలు తాత్కాలికంగా చేపట్టారు. నివారణ చర్యలను నిరంతరం కొనసాగించాలని కిష్టారం గ్రామస్థులు కోరుతున్నారు. ఇటీవల ఇదే విషయాన్ని సత్తుపల్లిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కిష్టారం గ్రామస్థులు వినతిపత్రం ద్వారా విన్నవించారు. అధికారులు వెంటనే స్పందించి బొగ్గు రవాణా చేస్తున్న లారీ పరదాలు కప్పి, వాతావరణ కాలుష్యాన్ని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.


బొగ్గు టిప్పర్ల కారణంగా నల్లగా మారిన రహదారి వెంట వృక్షాలు


పరదాలు లేకుండా వెళ్తున్న బొగ్గు లారీ

జూలూరుపాడులో 60కేజీల గంజాయి పట్టివేత..?

● పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు..?

జూలూరుపాడు, మార్చి9: కారులో తరలిస్తున్న గంజాయిని వాహన తనిఖీల్లో పోలీసులు పట్టుకున్న సంఘటన శనివారం జూలూరుపాడు పోలీస్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం.. చండ్రుగొండ ఎస్ఐ రవి జూలూరుపాడు పోలీస్‌స్టేషన్ వద్ద స్థానిక సిబ్బందితో కలిసి వాహన తనిఖీలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారును తనిఖీ చేశారు. ఆ కారులో గంజాయి పట్టుబడింది. పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేసి, ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. సుమారు 60కేజీలు (31ప్యాకెట్లు) గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.15లక్షలు ఉంటుందని సమాచారం. గంజాయిని తరలిస్తున్న యువకులు ఎక్కడికి తరలిస్తున్నారన్న వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

జీరో బిల్లు రాలే...



జీరో బిల్లు రాలేదంటున్న కల్లూరుకు చెందిన ఎస్కే సాలేహా

- ఆన్‌లైన్‌లో తప్పుగా వివరాల నమోదు
- డేటా ఎంట్రీ తప్పిదాలతో పూర్తి విద్యుత్ బిల్లులు
- అర్హులయినా అందని గృహజ్యోతి పథకం
- న్యాయం చేయాలంటున్న బాధితులు

కల్లూరు/ ఖమ్మంకార్పొరేషన్, మార్చి9: దేవుడు వరమిచ్చినా, పూజారి కరుణించలేదన్నట్లు... ప్రభుత్వం ప్రకటించిన ఆరుగ్యారెంటీలకు దరఖాస్తులు చేసుకున్నవారి పరిస్థితి. కంప్యూటర్ ఆపరేటర్లపై ఉన్నతాధికారులు తీవ్రంగా ఒత్తిడి చేయటంతో దరఖాస్తుదారుల వివరాలను తప్పుల తడకగా నమోదు చేశారు. దీంతో అర్హులైనప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు లేకపోవటంతో సదరు దరఖాస్తు దారులు పథకాల లబ్ధి పొందలేకపోతున్నారు. మళ్లీ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినా, దరఖాస్తుదారుల వివరాలు లేకపోవటంతో మళ్లీ దరఖాస్తులు తీసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం సంబంధిత వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తేనే వాటిని నమోదు చేసే అవకాశం ఉంది.

అర్హులు అయినా..

కల్లూరు మండలంలోని కల్లూరు, పుల్లయ్యబంజరు, లోకవరం, కప్పల బంధం, ముగ్గువెంకటాపురం, చండుపట్ల, పేరువంచ గ్రామాల్లో అర్హులైన పేదలకు మాత్రం గృహజ్యోతి పథకానికి అనుర్హులుగా చేస్తూ బిల్లులు రావటంతో పలువురు లబోదిబో మంటున్నారు.

ఖమ్మం నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన ఒక వ్యక్తి నెలకు 200 యూనిట్లలోపే విద్యుత్ వినియోగం చేస్తున్నాడు. ఉచిత విద్యుత్‌కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అతడికి జీరో విద్యుత్‌బిల్ రాలేదు. దీంతో సదరు వ్యక్తి ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్ వద్ద విచారణ చేస్తే అతడి దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



సవరించాలలని కోరుతున్న బాధితులు

దీంతో ఆ దరఖాస్తుదారుడు ఖంగుతిన్నాడు. ఇలా పలువురు అర్హులైనప్పటికీ ఆన్‌లైన్ నమోదులో తప్పులు చేయటంతో లబ్ధిపొందలేక పోతున్నారు.

కల్లూరు మండలంలో..

కల్లూరు మండలంలో 31 గ్రామాల్లో సాగిన ప్రజా పాలన సభలలో 23 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయడానికి ప్రైవేటు ఆపరేటర్లను నియమించి పది రోజుల్లో దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. డేటా ఆపరేటర్లు పలువురి వివరాలు తప్పుగా నమోదు చేయటంతో మండల పరిధిలో గల పలు గ్రామాల్లో అర్హులైన పేదలకు గృహజ్యోతి పథకం వర్తించడం లేదు. పలు గ్రామల్లో సుమారు 500 నుంచి 1000 మంది పేదలు ఈ పథకానికి అనర్హులుగా మిగిలారు.

తీవ్రమైన ఒత్తిడితో..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. నగరపాలకసంస్థ పరిధిలో సుమారు 83వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని జనవరిలో ఆన్‌లైన్‌లో నమోదుచేశారు. అయితే కొంత సమయం ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులు ఒత్తిడి చేయటంతో నమోదు ప్రక్రియ తప్పుల తడకగా మారింది. అయితే కొంతమంది దరఖాస్తుదారులు పూర్తి సమాచారం ఇవ్వకపోవటంతో వారి దరఖాస్తులను పక్కన పడేశారు. తూతూ మంత్రంగా మళ్లీ సర్వేచేసి, మమ అనిపించారు. దీంతో అర్హులైన వారికి పథకాలు అందకుండా పోయాయి. మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తున్నా, పథకాలు ఎప్పుడు అమలవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఆపరేటర్లు చేసిన తప్పులకు తమను బాధ్యులుగా చేయకుండా అర్హులైన వారందరికీ పథకాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

జాతీయ బ్యాడ్మింటన్‌కు బోనకల్ క్రీడాకారులు





జాతీయ పోటీలకు ఎంపికైన ఓంకార్, జ్యోతిర్మయి, రూప

బోనకల్, మార్చి 9: ఈ నెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు బిహార్‌లో జరగనున్న 68వ జూనియర్ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బోనకల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఈ నెల 8వ తేదిన నిర్వహించిన ఎంపికల్లో జె. ఓంకార్, టి. జ్యోతిర్మయి, కె. రూప జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జ్యోతిర్మయి, రూప బోనకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టీఎస్‌డబ్లుఆర్‌ఎస్‌లలో 9వ తరగతి చదువుతుండగా, ఓంకార్ ఖమ్మంలో డిగ్రీ చదువుతున్నాడు. ఇద్దరు విద్యార్థినులు ఇప్పటికే జాతీయస్థాయి పోటీలలో ఆడారు. మరోసారి బిహార్‌లో తమ సత్తా చాటేందుకు బోనకల్‌లో ముమ్మరంగా క్రీడా సాధన చేశారు. వీరి ఎంపిక పట్ల జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అమరేసి లింగయ్య, తంగెళ్ల ఉంపేద్ర, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వద్దిరాజుకు టీజేఎఫ్ సన్మానం



రవిచంద్రను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంకార్పొరేషన్, మార్చి9: రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రను టీయూడబ్ల్యూజే-టీజేఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఆయన నివాసంలో కలుసుకొని అభినందనలు తెలిపి సన్మానించారు. ప్రజాకాంక్ష మేరకు భవిష్యత్‌లో రాజకీయాల్లో మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఖమ్మంలో భట్టి, తుమ్మల పర్యటన

బోనకల్/ ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 9: ఉప ముఖ్యంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. బోనకల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారు. ఆయన ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటలకు బోనకల్ చేరుకుంటారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు శనివారం తెలిపారు. కలకోట నుంచి నారాయణపురం, ఆళ్లపాడు నుంచి నారాయణపురం, ఆళ్లపాడు నుంచి గోవిందాపురం(ఎ), గోవిందాపురం నుంచి మోటమర్రి, లక్ష్మీపురం నుంచి పాతర్లపాడు వరకు గల రహదారులకు బీటీ రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ నుంచి రఘునాథపాలెం మండలంలోని బూడిదంపాడుకు మధ్యాహ్నం 1.30గంటలకు చేరుకొని ఖమ్మం ఇల్లెందు రహదారి విస్తరణపనులను ప్రారంభిస్తారు. తర్వాత రఘునాథపాలెం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షలో పాల్గొంటారు. ప్రజాపాలన దరఖాస్తులు, ఆరు గ్యారెంటీ పథకాల అమలు తీరుపై సమీక్షిస్తారు. సాయంత్రం 5గంటలకు ఖమ్మంలోని స్వర్ణ భారతి కల్యాణ మండపంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు.

బాధిత రైతులకు అండగా..

22 కుటుంబాలకు రూ.50వేల చొప్పున అందజేత ● రూ.11లక్షలు పంపిణీ చేసిన 'వివేకానంద'



రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించిన వివేకానంద సేవాసంస్థ ప్రతినిధులు

రఘునాథపాలెం, మార్చి 9: రెండేళ్ల కాలంలో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం వంటి కారణాలతో అకాల మరణాలు జరిగిన రైతుల కుటుంబాలకు అండగా మేము సైతం అంటూ ఆర్థిక సహాయం అందించింది హైదరాబాద్‌కు చెందిన వివేకానంద సేవా సంస్థ. రఘునాథపాలెం, కామేపల్లి మండలాల్లోని చిమ్మపూడి, కోయచెలక, కృష్ణాపురం గ్రామాల్లో 22 మంది రైతులు రెండ సంవత్సరాల కాలంలో కన్నుమూశారు. బాధిత రైతుల వివరాలను రఘునాథపాలెం వైస్ ఎంపీపీ గుత్తా రవికుమార్, మాజీ ఉప సర్పంచ్ గుత్తా వెంకటేశ్వరరావు వివేకానంద సేవా సంస్థకు తెలియజేస్తూ రైతు కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను వివరించారు.దీంతో స్పందించిన సంస్థ సభ్యులు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 22 మంది రైతు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున రూ.11 లక్షల నగదును వస్త్రాలు, పండ్లు పెట్టి రైతు కుటుంబాలను సన్మానించి పంపించారు. ఈ సందర్భంగా రఘునాథపాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైస్ ఎంపీపీ గుత్తా రవికుమార్ మాట్లాడుతూ వివేకానంద సేవా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుండ్ల ముత్తయ్య, రైతు సంఘం కన్వీనర్ దొంతు సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, వీరబాబు, కోటేరు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పూటీ లాగుడు పోటీ



ప్రథమ స్థానంలో నిలిచిన ఎద్దుల జత

మధిరటౌన్, మార్చి9: మధిర శ్రీమృత్యుంజేయ స్వామి దేవాలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల ఎద్దుల పూటీ లాగుడు పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మధిర సీఐ డి. మధు ప్రారంభించారు, ఖమ్మం, కొత్తగూడెం, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి రైతులు పోటీలో పాల్గొనేందుకు తమ ఎద్దుల జతలను తీసుకొచ్చారు. తొలిరోజు ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం దాములూరు గ్రామానికి చెందిన ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది.

పోటీలను తిలకించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తనయుడు సూర్య విక్రమాదిత్య, హీరో ప్రభాస్ సోదరి సాయి ప్రసీద రావడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించగా శనివారం మధిర పురవీధుల్లో స్వామి వారు అమ్మవార్లను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అలయ ఈవో జగన్మోహన రావు, అర్చకులు సత్యనారాయణ శర్మ పోటీల నిర్వాహకులు పాటిబండ్ల సత్యంబాబు, చెరుకూరి నాగార్జున, యన్నం కోటేశ్వరరావు, వంకాయలపాటి నాగేశ్వర రావు, కర్నాటి రామారావు, మోహనరావు పాల్గొన్నారు.

కన్నులపండువగా సంగమేశ్వర కల్యాణం



జాతరకు పోటెత్తిన భక్తులు

ఖమ్మంరూరల్/ బూర్గంపాడు/ అన్నపురెడ్డిపల్లి / చర్ల, మార్చి 9: ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి సందర్భంగా జాతరకు రెండో రోజు శనివారం భక్తులు పోటెత్తారు. శుక్రవారం అర్థరాత్రి శివుడు, గంగా సమేత సంగమేశ్వర కల్యాణం నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టీవిక్రమార్క సతీమణి నందిని తీర్థాల సంఘమేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. బూర్గంపాడు మండలం మోతెగడ్డ వీరభద్రస్వామి కల్యాణం కనులపండుగగా నిర్వహించారు. అన్నపురెడ్డిపల్లి శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించారు. చర్ల మండలం తేగడలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో శనివారం ఉదయం స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది.

ఈ భారం మోయలేం...

- వ్యాట్ అమలుపై మద్యం వ్యాపారుల నిరసన
- వైరాలో ఐఎంఎల్ డిపో ముందు ఆందోళన
- ఈ-చలాన్లు తీయకుండా భీష్మించిన వైనం
- ఉమ్మడి జిల్లాలో షాపులకు నిలిచిపోయిన మద్యం సరఫరా



ఐఎంఎల్ డిపో గేట్ ముందు నిరసన తెలుపుతున్న మద్యం వ్యాపారులు

వైరా, మార్చి 9: మద్యం షాపులకు వ్యాట్ (వ్యాల్యూ యాడెడ్ టాక్స్)ను అమలు చేయటాన్ని నిరసిస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మద్యం వ్యాపారులు ఆందోళన చేపట్టారు. వైరాలోని ఐఎంఎల్ డిపో ముందు మద్యం వ్యాపారులు శనివారం నిరసన తెలిపారు. దాంతో ఐఎంఎల్ డిపో నుంచి మద్యం సరఫరా నిలిచిపోయింది. మద్యం వ్యాపారులను వ్యాట్(వ్యాల్యూ యాడెడ్ ట్యాక్స్)పరిధిలోకి తీసుకువచ్చే సర్క్యూలర్‌ను అమలులోకి తెస్తూ సేల్స్‌ట్యాక్స్ అధికారులు గత పదిరోజులుగా మద్యం రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకోవడంతో వ్యాపారులు ఆందోళన చేపట్టారు.

2017నాటి సర్క్యూలర్‌ను అమలులోకి తెచ్చిన సేల్స్ ట్యాక్స్ అధికారులు వైరాలోని మద్యం డిపో నుంచి ఖమ్మం, మణుగూర్, ఇతర ప్రాంతాలకు మద్యంతో వస్తున్న వాహనాలను నిలిపివేశారు. సేల్స్‌ట్యాక్స్ ఆకస్మిక నిర్ణయంతో అటు ఎక్సైజ్‌శాఖ, ఇటు మద్యం వ్యాపారుల్లో గందరగోళం నెలకొంది. మద్యం ఎంఆర్‌పీ ధరలు పెంచకుండా సేల్స్ ట్యాక్స్ పేరిట తమను వేధించటాన్ని మద్యం వ్యాపారులు తీవ్రంగా నిరసిస్తున్నారు. ఇలాగే ఉంటే నిరవధికంగా మద్యం సరఫరా నిలిపివేస్తామని వ్యాపారులు హెచ్చరించారు.

ఉమ్మడి ఖమ్మంజిల్లాలో 261మద్యం దుకాణాలు, బార్లు, క్లబ్‌లు ఉన్నాయి. ఈ మద్యం వ్యాపారులంతా మద్యం కొనుగోలుకు ఈ-చలానాలు తీయకుండా ఐఎంఎల్ డిపో ముందు నిరసన చేపట్టారు. దాంతో దాదాపు రూ.పదికోట్ల పైచిలుకు మద్యం సరఫరా నిలిచిపోయింది. తామెందుకు వ్యాట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మద్యం వ్యాపారులు ప్రశ్నించారు. మద్యం దుకాణాల టెండర్ దాఖలు సమయంలో ఇలాంటి నిబంధన లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఉమ్మడి ఖమ్మంజిల్లాలోనే సేల్స్‌ట్యాక్స్ అధికారులు మద్యం రవాణా వాహనాలను నిలిపివేయడాన్ని తీవ్రంగా నిరసించారు.

ఈ సమస్య పరిష్కారమయ్యేవరకు మద్యం కొనుగోలుకు ఈ-చలానాలు తీయబోమని స్పష్టం చేశారు. వ్యాట్ ట్యాక్స్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఐఎంఎల్ డిపో ఇన్‌చార్జ్ చేకూరి నారాయణరావుకు మద్యం వ్యాపారుల సంఘం నాయకులు ఒక వినతి పత్రం సమర్పించారు. సంఘం నాయకులు గుర్రాల శ్రీనివాసరెడ్డి, చావా వెంకటేశ్వరరావు, నాగభూషణ్‌రెడ్డి, పొన్నం సుబ్బారావు, గోవిందరాజు, గొర్రెపాటి రమేష్, రాధాకృష్ణ, చింతల సత్యనారాయణ, నాగేశ్వరరావు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భద్రాద్రికి కొత్త సొబగులు అద్దాలి..

- ఆధ్యాత్మికం....ఆనందం...ఆహ్లాదంతోనే పర్యాటకానికి ఊతం
- భక్తులకు మౌళిక వసతులు, సదుపాయాలు కల్పించాలి
- డార్మెట్రీ, వసతి గదులకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలి
- భక్తరామదాసు ప్రాజెక్టుపై దృష్టిసారించాలి
- పర్ణశాలను సుందరంగా తీర్చిదిద్దాలి



పాండురంగాపురం రైల్వే స్టేషన్

భద్రాచలం, మార్చి 9 : ఆధ్యాత్మికం...ఆనందం...ఆహ్లాదం ఈ మూడు ఉంటేనే పర్యాటకానికి ఊతమిచ్చినట్లు అవుతుంది. ఎందుకంటే దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల రామక్షేత్రంతో పాటు పరిసరాల్లో రామాయణ ఇతివృత్తంతో ముడిపడి ఉన్న వాటిని అభివృద్ధి చేయాల్సి ఉంది. అలాగే భద్రాద్రి దేవస్థానం అనుబంధ ఆలయమైన పర్ణశాలలోని రామాలయం, పరిసరాలు మరింత ఆధ్యాత్మిక శోభతో సొబగులద్దాలి. వీటిని తిలకించేందుకు వచ్చే భక్తులకు మౌళిక వసతులు, సదుపాయాలపై ప్రభుత్వం అధికార యంత్రాంగం అంకితభావంతో కృషి చేస్తే పర్యాటక రంగం మరింత వేగంగా దూసుకుపోతుంది అనడంలో అతిశయోక్తి లేదు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి ఆధ్యాత్మిక, పర్యాటక భక్తులను ఆకర్షించడానికి ప్రభుత్వం, ఉన్నతాధికారులు నిబద్ధతతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డార్మెట్రీ, వసతి గదులు

ప్రధానంగా ఆధ్యాత్మిక పర్యాటక రంగాలు మరింత వేగంగా విస్తరించలంటే భద్రాచలం, పర్ణశాలల్లో అతిసామాన్య భక్తులు సేద తీరేందుకు అధిక డార్మెట్రీలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలి. అలాగే వంద గదుల సత్రాలు మరో మూడు భద్రాచలంలో నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రామ భక్తులు పేర్కొంటున్నారు. భక్తులకు ఆలయ దర్శనంలో ఎటువంటి తొక్కిసలాట, ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్ల విధానం శాశ్వత ప్రాతిపదికన చేపట్టడం ద్వారా వారిని ఆకర్షించేందుకు వీలుంటుంది. భద్రాచలంకు వచ్చే భక్తుల్లో 80 శాతం మంది రహదారి మార్గం ద్వారానే భద్రాద్రి చేరుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. బూర్గంపాడు మండలం పాండురంగాపురం నుంచి సారపాక వరకు రైల్వే లైను పొడిగించి భక్తులకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది. అంతేకాదు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంతో పాటు దేశంలోని ప్రధాన రైల్వే జోన్ల నుంచి రైళ్లను భద్రాచలంకు చేరువగా తెచ్చేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాల్సి ఉంది.

భక్తరామదాసు ప్రాజెక్టు

ఆధ్యాత్మిక, పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వం భక్తరామదాసు ప్రాజెక్టుపై దృష్టి సారించాలి. రామదాసు అనేక కీర్తనలను రచించినప్పటికీ కొద్ది కీర్తనలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన కీర్తనలను సేకరించేందుకు దృష్టి నిలపాలి. భక్తరామదాసు తరువాత మరో భక్తరామదాసుగా పేరుగాంచిన రాజ తూము లక్ష్మీనరసింహదాసు కీర్తనలను సైతం సేకరించి వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదే సమయంలో ఈ ఇరువురు వాగ్గేయకారుల స్మారక మందిరాలు ఒకే చోట ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉంది. భక్తరామదాసు ధ్యానమందిరం భద్రాచలంలోని రంగనాయకుల గుట్టపై ఉన్న అది భక్తుల ఆదరణకు నోచుకోని పరిస్థితి ఉంది. కాగా తూము లక్ష్మీనరసింహదాసుకు సంబంధించి ఒక స్మారకం కూడా లేకపోవడం బాధాకరం. ఇరువురు వాగ్గేయకారుల స్మారకాలను ఒకే చోట ఏర్పాటు చేసి ప్రతి నెల పునర్వసు, పుష్యమి నక్షత్రాల రోజున అటు రామదాసు, ఇటు తూము నరసింహదాసు కీర్తనలను ఆలపించడానికి వేదికలను ఏర్పాటు చేయాలి.

పర్ణశాలకు కొత్త సొబగులు

భద్రాచల క్షేత్ర ఆవిర్భావంకు మూలకారణమైంది పర్ణశాల క్షేత్రం, ఈ క్షేత్రాన్ని కూడా అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇక్కడ భక్తులు ఉండటానికి వసతి గృహాలు లేవు. వంద గదుల సత్రం ఇక్కడ కూడా ఒకటి నిర్మించాల్సి ఉంది. సర్వజన ఆకర్షణగా సీతాకుటీరం, అలాగే రాముని పర్ణశాల నివాసాన్ని అక్కడ జరిగిన సంఘటనలను కనులకు కట్టేలా ఓ థీమ్ పార్కును సైతం నిర్మిస్తే పర్యాటకం పరుగులు పెడుతుందనడంలో సందేహం లేదు.

పోరాట యోధుడు రాయల బోస్

- మాస్‌లైన్ కేంద్ర కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్

తిరుమలాయపాలెం/ ఖమ్మం రూరల్, మార్చి 9: తాడిత , పీడిత, భూమి, భుక్తి, ప్రజల విముక్తి కోసం భారత విప్లవోద్యమంలో కీలక భూమిక పోషించిన రాయల సుభాష్‌చంద్రబోస్ పోరాట యోధుడని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్ అన్నారు. శనివారం మండలంలోని పిండిప్రోలులో పార్టీ జాతీయ నాయకులు రాయల సుభాష్‌చంద్రబోస్ 8వ వర్ధంతి సభ సర్పంచ్, సీపీఐ ఎంఎల్ ప్రజాంధా జిల్లా నాయకులు రాయల నాగేశ్వరరావు ప్రథమ వర్ధంతి సభ కమ్మకోమటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సభకు ముందుగా హాజరైన ప్రజలు ప్రదర్శనగా వెళ్లి రాయల సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. అనంతరం మాస్‌లైన్ కేంద్ర కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ బోస్ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కూడా కీలక పాత్ర పోషించారని ఆయన తెలిపారు. జాతీయ సహాయ కార్యదర్శి సుభాష్‌దేవ్ మాట్లాడుతూ ఫాసిస్టు మతోన్మాద శక్తులను ఓడించి విప్లవ శక్తులను ఐక్యం చేయడమే బోస్‌కు ఘనమైన నివాళులన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు రాయల చంద్రశేఖర్, కె.రమ, జాతీయ నాయకులు కృష్ణగోగ్రైయ్,జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరావు గుర్రం అచ్చయ్య, పి.వెంకటస్వామి నవీన్, పునులూరి పుల్లయ్య, తిమ్మిడి హనుమంతరావు, ఆర్.శివలింగం, రవన్నట్రస్టు వైస్ చైర్మన్ పునులూరి నరేందర్, పునులూరి గిరి, మీగడ సైదులు, గొడుగు విజయ్, ఆరెంపుల వెంకన్న, పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులను ఓడించాలి: పోటు



మాట్లాడుతున్న పోటు రంగారావు

దేశంలో విప్లవ పార్టీలు అనైక్యతకు గురైఉన్నాయని, మతోన్మాద ఫాస్ట్ దోపిడీ వర్గాలను ఓడించడానికి ఐక్యం కావాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కమిటీ సహాయ కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. ఖమ్మం రూరల్ మండలం లోని ఎం. వెంకటాయాపాలెం గ్రామంలోని మాస్ లైన్ కార్యాలయంలో రవన్న ట్రస్ట్ అధ్యక్షుడు గుర్రం అచ్చయ్య అధ్యక్షతన జరిగిన సుభాష్ చంద్రబోస్ 8వ వర్ధంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన పది సంవత్సరాల కాలంలో కార్పొరేట్ వర్గాలైన అదాని, అంబానీ కార్పొరేట్ వర్గాలకు దేశంలోని అన్ని వనరులను కట్టబెడుతూ, పేదరికం నిరుద్యోగం అప్పులు మిగిల్చారని ఆయన అన్నారు. దేశంలో సమసమాజం సిద్ధించాలంటే ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య, ట్రస్ట్ బాధ్యులు కృష్ణమూర్తి, నరేందర్, మారుతి మల్లయ్య, మలీదు నాగేశ్వరరావు, కుర్రా వెంకన్న, యాదగిరి, ఉపేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో మహిళల నిరసన

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

పెనుబల్లి, మార్చి 9: మండలంలోని లింగగూడెం ఎస్టీకాలనీలో గత ఐదురోజులుగా తాగునీరు రావడం లేదని శనివారం గ్రామంలోని ప్రధాన రహదారిపై మహిళలు, యువకులు బిందెలతో బైఠాయించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఐదురోజులుగా తాగునీరు రావడం లేదని, నీటి కోసం నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోయారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బద్దం వెంకటేశ్వరరావు మూడెకరాల భూమిని కౌలుకు తీసుకొని బోర్ నీటిని పొలానికి మళ్లించాడని అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు చేతబూని నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి డి.ప్రసాద్ ఆందోళన వద్దకు చేరుకొని రెండురోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో మాజీ సర్పంచ్ పొలానికి మళ్లించిన బోర్ నీటిని పంచాయతీ కార్యదర్శి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కుంజా భవానీ, బద్దం రాణి, శీలం శ్రావణి, తెల్లం సురేష్, తవలం పాండు, బద్దం తిరుపతిరావు, బద్దం రామకృష్ణ, శీలం మురళీ పాల్గొన్నారు.

వన్యప్రాణుల దాహార్తిని తీర్చండి

ట్రెయినీ కలెక్టర్ మయాంక్ సింగ్



సత్తుపల్లిరూరల్, మార్చి9: వేసవి దృష్ట్యా వన్యప్రాణుల దాహార్తిని తీర్చాలని ట్రెయినీ కలెక్టర్ మయాంక్ సింగ్ కోరారు. శనివారం సత్తుపల్లి మునిసిపాలిటీలోని నీలాద్రి అర్బన్ పార్క్‌లో ఈవినింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా పార్క్ పరిసరాలను గమనించి పలు సూచనలు చేశారు. వాకర్స్‌తో పాటు పర్యాటకులతో మాట్లాడారు.దాహం కోసం వన్యప్రాణుల అలమటించకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. మొక్కలకు నీటిని సమృద్ధిగా చూడాలని, దుప్పుల సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌వో ముత్యాలరావు, ఎఫ్‌బీవో ముత్తి వెంకటేశ్వర్లు ఉన్నారు.

కేయూ దూరవిద్య ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి9: కాకతీయ యూనివర్శిటి పరిధిలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (గతంలో ఎస్‌డిఎల్‌సిఈ)డిగ్రీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ మ్యాథ్స్ బ్యాచ్‌లర్ ఆఫ్ లైబ్రెరీ సైన్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. పీజీలో మెత్తం 43 కోర్సులకు ఈ నెల20లోగా దరఖాస్తులు నగరంలోని అధ్యయన కేంద్రంలో అందించాలని తెలిపారు.

కిరణ్‌శౌరికి డాక్టరేట్



వైరా, మార్చి9: వైరాలోని శ్రీచైతన్య డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ చింతల కిరణ్‌శౌరికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రధానంచేసింది. రవీంద్రనాథ్‌ఠాగూర్స్ విజన్ ఆఫ్ రెలీజియన్ అండ్ ఎడ్యుకేషన్ ఏ ఫిలాసఫికల్ అనాలసిస్ అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

వైభవంగా శివపార్వతుల రథోత్సవం







కూసుమంచిలో కన్నులపండువలా శివయ్య రథోత్సవం, గుంటుమల్లేశ్వరస్వామి దేవాలయం నందిని పూజలు, పైనంపల్లిలోని శివాలయం వద్ద అన్నదానం

కూసుమంచి, మార్చి 8: మహాశివరాత్రిని పురస్కరించుకుని కాకతీయుల గణపేశ్వరాలయంలో శివపార్వతుల రథోత్సవాన్ని (నగరసంకీర్తన) శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. శివపార్వతుల విగ్రహాలను రథంలో ఉంచి గణపేశ్వరాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఊరేగించారు. సంప్రదాయ మంగళవాయిద్యాలు, డప్పుచప్పుళ్లతో వీధుల్లో శోభాయాత్ర జరిగింది.

గుంటుమల్లేశ్వరస్వామిని దర్శించుకున్న నందిని

ఖమ్మంసాంస్కృతికం: డిప్యూటీసీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని శనివారం ఖమ్మం నగరంలోని గుంటుమల్లేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బాలగంగాధర్ తిలక్, మాడిశెట్టిమదన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కోటిలింగాల జాతర

కారేపల్లి: మండల పరిధిలోని పోలంపల్లి గ్రామంలో జరుగుతున్న కోటిలింగాల జాతర శనివారం రెండోరోజు కొనసాగుంది. మూడు రోజులపాటు జరిగేజాతరకు రెండోరోజు వివిధప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. శివయ్య దర్శించుకుంటున్నారు. భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు సరైన నీటిసౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

పైనంపల్లిలో మహా అన్నదానం

నేలకొండపల్లి: మండల పరిధిలోని పైనంపల్లి గ్రామంలోని శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయం వద్ద శనివారం మహాఅన్నదానం నిర్వహించారు. శనివారం ఆలయంలో పూజలు పూర్తైన అనంతరం అన్నదానం చేశారు. దాదాపు రెండు వేల మందికి అన్నదానం చేసారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఉసిరికాయల లక్ష్మయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు నల్లాని మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు



నేరడలో కబడ్డీ పోటీల దృశ్యం

చింతకాని: మహాశివరాత్రి జాతర సందర్భంగా మండల పరిధిలోని నేరడలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు రెండవ రోజు కొనసాగాయి. రెండవ రోజు పోటీలను మండల ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తు పోటీలు నిర్వహిస్తున్న నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు దూసరి నేతాజీను అభినందించారు. నేడు ఫైనల్ పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యం

లెఫ్టినెంట్ కల్నల్ నవీన్ యాదవ్

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 9: జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకోవాలంటే చదువుతో పాటు, క్రీడలు కూడా ముఖ్యమని లెఫ్టినెంట్ కల్నల్ నవీన్ యాదవ్, న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ ప్రసాద్ అన్నారు. నగరంలోని న్యూవిజన్ పాఠశాల వార్షిక క్రీడోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై పోటీలను ప్రారంభించారు. వివిధ క్రీడాపోటీలను వారంరోజులు ప్రత్యేకంగా నిర్వహించటం అబినందనీయమన్నారు. ముగింపు ఉత్సవంలో విజేతలకు బహుమతులను అందించారు. ఈ ఏడాది స్కూల్ చాంపియన్ షిప్ బ్లూ గ్రీన్ హౌస్ వారు గెలుపొందారు.విద్యాసంస్థల చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రైమరీ, హైస్కూల్, ఫౌండేషన్ విభాగాల్లోని విద్యార్థులకు విడుతల వారీగా ఏటా ప్రత్యేకంగా ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సంవత్సరం దాదాపు వెయ్యికి పైగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సీహెచ్. కార్తీక్, ఫైనాన్స్ డైరెక్టర్ సీహెచ్. గోపిచంద్, ప్రిన్సిపాల్ ఎం.డి. అబాద్ అలీ పాల్గొన్నారు.



విద్యార్థులతో చైర్మన్ ప్రసాద్, లెఫ్టినెంట్ కన్నల్

రైతులను ఇబ్బందిపెట్టొద్దు

పీఏసీఎస్ చైర్మన్ కాట్రాల రోషయ్య

కామేపల్లి, మార్చి 9: కామేపల్లి పీఏసీఎస్ పరిధిలోని సకాలంలో రుణాల వడ్డీలు చెల్లించిన 700మంది రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని పీఏసీఎస్ చైర్మన్ కాట్రాల రోషయ్య అన్నారు. శనివారం సొసైటీల కార్యాలయంలో పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి చైర్మన్ రోషయ్య, డైరెక్టర్ యాదగిరి తప్ప ఎవరు హాజరుకాలేదు. కోరం పూర్తి కాకపోవడంతో మావేశంలో రద్దు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు సకాలంలో 700రైతులు తమ వడ్డీలను రూ2.14 కోట్లు చెల్లించారు. కొత్త పాలకవర్గంతో తీర్మానాలను చేస్తేనే రైతుల ఖాత్లో ఆ వడ్డీల జమ చేయాలన్నారు. ఈనెల 31లోగా రైతుల రుణాల రెనువల్ చేయకపోతే సొసైటీ రద్దు అయ్యే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా పాలకవర్గ సభ్యులు సమావేశాలకు రావాలని కోరారు.

వైరా కాల్వలకు నీరు విడుదల చేయాలి

ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు రైతుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వైరా, మార్చి 9: వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వలకు రెండురోజులు నీరు విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌కు రైతులు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారంరాత్రి విప్పలమడకలోని శివాలయం వద్ద విప్పలమడక, లింగన్నపాలెం, గరికపాడు, దాచాపురం, గన్నవరం తదితర గ్రామాల రైతులు కలిసి వినతిపత్రం సమర్పించారు. వరి ఇతర ఆరుతడి పంటలు ఎండిపోతున్నాయని, ఒక్కసారి నీరిస్తే కాపాడుకుంటామని వివరించారు. ఈ విషయమై ఎమ్మెల్యే స్పందిస్తూ మంత్రులు, ఉన్నతాధికారులకు సంప్రదించి నీరు విడుదల చేయించేందుకు తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వేంసూరు, మార్చి9: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మట్టా రాగమయి పేర్కొన్నారు. శనివారం వేంసూరు, మర్లపాడు, రాయుడు పాలెం, మద్దులగూడెం, బీరాపల్లి, కుంచపర్తి, శంభునిగూడెం గ్రామాల్లో రూ.1.60 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాగమయి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఎ.రాజు, ఎంపీడీవో నాగేశ్వరరావు, పీఆర్ ఏఈ సాయి, ఎంపీటీసీ రాఘవరెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, దుగ్గిరాల అశోక్, ఎండీ.ఫైజుద్దీన్, వెల్ది జగన్మోహన్‌రావు, గరికపాటి శ్రీనివాసరావు, వేల్పుల బుచ్చాలు, రాంబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఖమ్మంరూరల్, మార్చి9: వేసవి నేపథ్యంలో విద్యుత్తు లోడ్ పెరగకుండా, అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా వరంగల్‌క్రాస్‌రోడ్డు, పెద్దతండా విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలోని మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా కేంద్రాల పరిధిలో ఆదివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని వరంగల్‌క్రాస్ రోడ్డు ఏఈ క్రాంతి సింహ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దతండా, ఏదులాపురం, గుర్రాలపాడు గ్రామ పంచాయతీల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు.

తల్లాడ: మండలంలోని ఇండస్ట్రియల్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తల్లాడ ఏఈ రాజేష్ తెలిపారు. మండలంలోని తల్లాడ, అన్నారుగూడెం, గోపాలపేట పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని ఐపీడీఎస్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని సిద్దారం రోడ్ ఫీడర్ డీటీఆర్, ఫీడర్ మెయింటెనెన్స్ కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న విద్యుత్ ఏఈ శరత్‌బాబు శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. మాధురి ఫంక్షన్‌హాల్ రోడ్, రాజబాపయ్య వీధి, సిద్దారం రోడ్‌లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అనాథాశ్రమానికి నగదు వితరణ

మధిరటౌన్,మార్చి9: మధిరలోని ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథాశ్రమానికి ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వేణు గోపాలరావు, ఝాన్సీ దంపతులు ఐదు వేలు శనివారం నిర్వహకులకు అందించారు. కార్యక్రమంలో నిర్వహకులు రామకృష్ణ, జ్యోతి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల హర్షం



మిఠాయిలు తినిపించుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్, మార్చి9: ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం పీఆర్సీ ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం రాత్రి సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. పెరిగిన జీతాలు జూన్ 1వ తేదీ నుంచి అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా మాట ఇచ్చిన రెండు రోజుల్లోనే అమలుకు కృషిచేసిన రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీ, సూపర్‌వైజర్లు సుబ్బారావు, విజయకుమార్, బాలస్వామి, వీడీ.రెడ్డి, తిరుపతయ్య, ఇశ్రాయిల్, జగన్నాధం, పీవీ.రావు, ఆర్వీ.రావు, సెక్యూరిటీ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

డ్రెయిన్లకు శంకుస్థాపన

కల్లూరు,మార్చి9 మండలంలోని బత్తులపల్లి, ఎర్రబంజరు గ్రామాల్లో డ్రెయిన్ల నిర్మాణ పనులకు శనివారం స్థానిక ప్రజా ప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు. రూ.8 లక్షల అంచనాతో పైగ్రామాల్లో చేపట్టిన పనులకు ఎంపీటీసీ కొర్రా రుక్మిణతో పాటుగా మాజీ సర్పంచు శీలం కృష్ణారెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. తమ గ్రామాలకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మట్టా రాగమయికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కత్తి కృష్ణారెడ్డి, జంగా పిచ్చిరెడ్డి, కొర్రా నరిసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల దోపిడీని అరికట్టడమే రవన్నకిచ్చే నివాళి

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, ప్రజా సంఘాలు, రాయలకు ఘన నివాళి



సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతి

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి9. ఫాసిస్ట్, మతోన్మాద అంతమొందించటం, కార్పొరేట్ శక్తుల దోపిడిని అరికట్టటమే కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్(రాయల రవన్న)కు ఇచ్చే నివాళులు అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, జాతీయ నాయకులు కొదనపల్లి వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన రాయల సుభాష్ చంద్రబోస్ 8వ వర్ధంతి సంస్మరణ సభలో వారు మాట్లాడారు. 50ఏళ్ల పాటు దోపిడి రహిత సమాజం కోసం రాయల రవన్న అజ్ఞాత జీవితం గడుపుతూ పోరాటం చేశారని వివరించారు. నాయకులు కృష్ణ గోగయి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, ఆవుల మంగతాయి, గోకినేపల్లి లలిత, ఝాన్సీ, నామాల ఆజాద్, చందు, యోగానందం, లక్ష్మీ పాల్గొన్నారు. గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోధుడు కామ్రేడ్ రాయల రవన్న పోరాట స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై నాయకులు పోరాటం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జీ రామయ్య పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మంలోని పలు కార్మిక కూడళ్లలో రవన్న 8వ వర్ధంతి కార్యక్రమాల్లో రామయ్య నివాళులు అర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే శ్రీనివాస్, చిలుకల నర్సింహారావు, రాచబంటి రవి, ములకపల్లి లక్ష్మీనారాయణ, బొమ్మకంటి రమేశ్, శ్రీను, వెంకన్న, చంద్రం పాల్గొన్నారు.

ఆశయాలను ముందుకు తీసుకువెళదాం

తల్లాడ: సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోధుడు రాయల సుభాష్‌చంద్రబోస్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు షేక్.లాల్‌మియా పిలుపునిచ్చారు. శనివారం తల్లాడ మండలం మంగాపురంలో రాయల సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, రామారావు, కృష్ణయ్య, అంజి, రాంబాబు, గోపాలకృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.



ఇఫ్టూ ఆధ్వర్యంలో..

మునిసిపల్ మహిళా సిబ్బందికి సన్మానం





ఖమ్మంలో సన్మానిస్తున్న మేయర్ నీరజ, వైరాలో సన్మానిస్తున్న జైపాల్

ఖమ్మంకార్పొరేషన్, మార్చి9: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం నగరంలోని బంజారభవన్‌లో నిర్వహించారు. నగరపాలకసంస్థకు చెందిన మహిళా కార్మికులను, మెప్మా సిబ్బందిని మేయర్ పునుకొల్లు నీరజ సన్మానించారు. మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచటంలో పారిశుధ్య మహిళా కార్మికులు ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ సుజాత,సూపరింటెండెంట్ శ్రీదేవి, ఏవో గుస్తా, నగరపాలకసంస్థ ఎన్విరాన్‌మెంట్ ఏఈ శ్రీనివాస్,మెప్మా సీవోలు, ఆర్పీలు, పారిశుద్ధ్య విభాగం జవాన్లు పాల్గొన్నారు.

వైరా, మార్చి 9: వైరా మునిసిపల్ కార్యాలయంలో శనివారం మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. మహిళా వార్డుకౌన్సిలర్లు, మెప్మా ఆర్పీలు, మునిసిపాలిటీలోని అన్నివిభాగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను సన్మానించారు. వైస్‌చైర్మన్ సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతరాములు, కౌన్సిలర్లు మాదినేని సునీత, కన్నెగంటి సునీత, దారెల్లి పవిత్రకుమారి, గుగులోతు లక్ష్మీబాయి పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలలో మహిళా దినోత్సవం

ముదిగొండ: ఖమ్మం నెహ్రూ యువకేంద్రం, ప్రజ్వల యువజన సంఘం ఆధ్వర్యంలో ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం కేజీబీవీ పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారీ శక్తి ఫిట్‌నెస్ రన్ నిర్వహించారు. అనంతరం గెలుపొందిన మహిళలకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో అన్వేష్, చింతమళ్ల పాపయ్య, భానుచందర్, ఇందిర పాల్గొన్నారు.

ఖమ్మం ఖానాపురంహవేలి: మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన మహిళలకు శనివారం బహుమతులు అందించారు. పీఆర్టీయూయ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, డాక్టర్ కావ్యాచంద్, సంఘం రాష్ట్ర సభ్యురాలు హరిత హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జయమ్మ, సునీత, భారతి, జిల్లా అధ్యక్షులు మోతుకూరి మధు, రంగారావు, యలమద్ది వెంకటేశ్వర్లు, సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

ఏన్కూరు, మార్చి9: గ్రామాల్లోని మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని జన్నారం ఎస్సీకాలనీ, గంగులనాచారం, హిమామ్‌నగర్, తిమ్మరావుపేట గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దశలవారీగాహామీలను తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, జడ్పీటీసీ బాదావత్ బుజ్జి, ఎంపీటీసీ స్వర్ణ శిరీష, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, మేడికొండూరు ప్రసాద్, కొనకంచి రామకృష్ణ, చందమామ నరసింహారావు, మేడా ధర్మారావు, మాలోతు నరసింహారావు ముక్తి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, గిద్దగిరి సత్యనారాయణ, చింతనబోయిన సీతారాములు, పూర్ణకంటి మైసారావు, శోభన్‌నాయక్, యంద్రాతి సాయిరోహిత్, పంతగాని నరేష్, స్వర్ణ ప్రహ్లాదరావు, బానోతు రామారావు పాల్గొన్నారు.